ఓంశ్రీసాయిరాం

సత్ప్రవర్తన సద్బుద్ధి సత్యనిరతి
భక్తి క్రమశిక్ష కర్తవ్యపాలనంబు
నేర్పునదె విద్య విద్యార్థి నేర్వవలయు
సత్యమును తెల్పు మాట శ్రీసాయి మాట.

విద్యాబోధకులారా!

ఏ దేశములోగాని, ఏ కాలములోగాని విద్యావిధానమునకు రెండే పరమావధులు. ఒకటి ఐహికము, రెండవది ఆముష్మికము. మొదటి దానిని జీవిత–జీవనోపాధి, రెండవ దానిని జీవిత–పరమావధి అంటారు. ఈ ఐహికము అనేదానిని మనము నిత్యజీవితములో అనుభవిస్తూనే ఉంటున్నాము. ఈ ప్రపంచములో, ఈ సమాజములో మానవుడు బ్రతికి వున్నంత కాలము కూడుగుడ్డలకు కొరత లేక జీవింపజేయునదే ఈ ఐహికవిద్య. ఇక ఆముష్మికమనగా దానికి భిన్నమైనది. అతీతమైన ఆత్మస్థాయిలో విహరించేటువంటిది ఆముష్మికవిద్య. జ్ఞానమనగా తెలివి అని అర్థము. అయితే, ఈ తెలివికి వ్యాపక లక్షణమే విద్య. 'సా విద్యా యా విముక్తయే'. అనగా ఏది మనలను దుఃఖమునుండి దూరముచేయునో. మృత్యువును తప్పించునో అదియే సరియైన విద్య. కనుక, మానవుని దుఃఖమునుండి దూరముచేయునది ఆముష్మికవిద్యగా మనము విశ్వసించాలి. ప్రతి మానవుడు తన జీవితములో కోరే కోరికలు రెండే, దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తి. జీవతమంతయూ ఈ రెండింటియందే యిమిడియున్నది. కనుక, దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తి నిమిత్తమై అభ్యసించేటువంటిదే ఈ ఆముష్మికవిద్య అనే సత్యాన్ని మనము పిల్లల హృదయమునకు హత్తుకొనే విధముగా బోధించాలి. ఇది జ్ఞానం, జ్ఞేయం, జ్ఞానలక్ష్యం– ఈ మూడింటియొక్క ఏకత్వంతో కూడినటువంటిది. ఈ మూడింటికినీ జ్ఞానభాస్కరుడైన మాధవుడే కర్త. అయితే, దీనికి శ్రద్ధ అత్యవసరం. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం'. శ్రద్ధ ఉన్నవారికే జ్ఞానము లభిస్తుంది. ఈ శ్రద్ధ ఏవిధంగా లభిస్తుంది? దశేంద్రియములను అదుపులో వుంచినవారికి మాత్రమే ఆత్మవిశ్వాసముద్వారా ఈ విద్య లభించే అవకాశము ఉంది. కనుకనే, ఈ దశేంద్రియములను అదుపులోవుంచే విధానాన్ని మనము మొదట ఈ లేతప్రాయమునందే పిల్లలకు బోధించటానికి పూనుకోవాలి. ఈ జ్ఞానము అనగా ఏమి? మానవుడు మాధవుడుగా మారటమే జ్ఞానముయొక్క గమ్యము. కనుక, జ్ఞానగమ్యము మాధవత్వమే. మాధవుడు – దీని అంతరార్థాన్ని మనము చక్కగా గుర్తించాలి. మా– అనగా ప్రకృతి. ప్రకృతిని నియమించే భర్తయే ధవుడు. ప్రకృతిని అదుపులో వుంచుకొని, దానిని తన ఇష్టానుసారముగా ప్రవర్తింపజేసే శక్తిసామర్థ్యములు కలవాడు మాధవుడు. పుట్టి, పెరిగి, గిట్టుటకు కారణము మాధవుడు. కనుక, యావత్ జీవులయొక్క సృష్టి, స్థితి, లయములు ఒక్క మాధవత్వమునందే వెలువడుతున్నవి. దైవత్వమనగా సృష్టి, స్థితి, లయములకు మూలాధారమని చెప్పాలి.

నీటియందె పుట్టి నీటనే తేలుచు
నీటియందణంగు నీటి బుడగ
నరుడు బుద్బుదంబు నారాయణుడు నీరు
ఉన్న మాట తెలుపుచున్న మాట.

ప్రతి జీవియును నారాయణుడను జలమునందే ఉద్భవించినది. జన్మము, ధన్యము, గమ్యము అన్నీకూడను ఒక్క లక్ష్యమునందే వెలువడినటువంటివి. కనుక, సర్వాధారుడైన సర్వేశ్వరుని గుర్తింపజేయునదే ఆముష్మికవిద్య. కాని, నేటి ఆధునిక యుగమందు అనేకమంది పెద్దలు, రాజకీయవేత్తలు, ఆధ్యాత్మిక ప్రబోధకులు అనేకవిధములుగా లోకములో ప్రచారప్రబోధలను సలుపుతూ వస్తున్నారు. కట్టుటకు బట్ట, తినుటకు తిండి, నివసించుటకు ఇల్లు, రోగమొస్తే నివారణకు మందు, పొట్టను పోషించుటకు అంతోయింతో విద్య ఉంటే మానవుడు సుఖశాంతులు అనుభవిస్తాడనేటువంటి బలహీనమైన విశ్వాసము అభివృద్ధి అవుతోంది. కాని, భౌతిక సుఖములు మానవునికి సుఖశాంతులను అందించలేవని గుర్తించటము లేదు. సుఖశాంతులు ఆత్మస్థాయినుండి లభించునవేగాని అన్యవస్తువులనుండి లభించునవికావు. భౌతిక సదుపాయములు కలవారు చాలామంది ఉన్నారు. కాని, వారు నిజముగా సుఖశాంతులను అనుభవిస్తున్నారా! లేదు. భౌతిక సౌఖ్యములు కేవలము ఐహిక సుఖములను చేకూర్చునవేగాని ఆముష్మికమైన ఆనందాన్ని అందించలేవు. అయితే మానవుడనగా ఎవరు? కేవలము రక్తమాంసములు, ఎముకలు, చర్మముతో కూడినవారా? అట్లే అయిన, కేవలము భౌతిక సదుపాయములతోనే సంతృప్తిని, శాంతిని పొంది ఉండేవారు. కాని, మానవుడు కేవలం రక్తమాంసములతో కూడినవాడే కాదు, ఇది కేవలం భౌతిక స్వారూపము. ఇది స్థూలమైన రూపం. దీనికి సూక్ష్మమైన మనస్సు, దానికి అతీతమైన కారణమను ఆత్మ ఉన్నాయి. మానవుడు స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు కలవాడు. భౌతిక సుఖములతో జీవించేది స్థూలశరీరమేగాని, సూక్ష్మకారణ శరీరములు కావు. మనసు ఎక్కువ భాగమైన సూక్ష్మ, కారణ శరీరాన్ని మరచిపోతున్నాము. కనుక, సుఖశాంతులను సమకూర్చేటువంటివి సూక్ష్మ, కారణ శరీరంచే అన్న సత్యాన్ని పిల్లలకు చక్కగా బోధించాలి. అందుకనే వేదాంత

పరిభాషయందు 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అని అన్నారు. బంధములకు, మోక్షమునకు మనస్సే కారణము కాని దేహము కాదు. ప్రతి మానవుడు మానసిక శాంతికై తపిస్తున్నాడు. మానవుడు సుఖశాంతుల నిమిత్తమై ఈ దేహముతో, పవిత్ర భావములతో కొన్ని సత్కర్మలను ఆచరించటానికి పూనుకోవాలి. మానవుడు సుఖాభిలాషి, ఆనందపిపాసి. ఈ రెండూ అయిన మానవుడు తన సుఖము, ఆనందము ఎక్కడనుండి లభిస్తుంది అనే విచారణ సలుపకుండా కేవలం భౌతిక, లౌకిక సుఖములనే మార్గములో ప్రవేశించటముచేత, తన నిజ సుఖాన్ని కోల్పోతున్నాడు. నిజముగా ఆనందము ఎక్కడనుండి వస్తుంది? బయటనుండి వస్తుందా? కాదు, ఆనందము మనకు సహజము. అది మన స్వభావము. చక్కెరకు తీపి ఎలా సహజమో, పుష్పమునకు సువాసన ఎలా సహజమో, మానవునకు ఆనందము అలా సహజము. కనుకనే, మనము ఏదైనా ఒక బజారునందు పోవునపుడు మార్గమందు ఒక వ్యక్తి గోడుగోడున ఏడ్చుచుండగా, 'అయ్యా! మీరు ఎందుకు అట్లా ఏడుస్తున్నారు' అని అడుగుతాము. ఈవిధముగా ప్రశ్నించటములో అంతరార్థమేమి? ఆనందించవలసిన మానవుడు ఏడుస్తున్నాడు. ఈ ఏడుపుకు కారణమేమి? ఏడుపు అసహజము. అదే ఎవరైనా ఆనందముగా ఉన్నప్పుడు వారిని, 'మీరు ఎందుకు విచారముగా లేరు' అని అడగము. కారణము, ఆనందము సహజ లక్షణము. ఈ కాలములో మన సహజమైన ఆనందాన్ని మరచేటువంటి విద్య మనము అభివృద్ధిపరుచుకుంటున్నాము. ఆనందమైన ఆత్మతత్త్వాన్ని అంతర్ముఖంగా విచారణ సలిపే శక్తిని మనము అలవరచుకోటము లేదు. మన దృష్టిని మనము అంతర్ముఖము చేసుకొని, విచారణశక్తికి తగిన అవకాశం అందించాలి. ఈనాటి విద్యలన్నీ ఏరకంగా ఉన్నాయనగా, ఉన్న సమయమంతా గ్రంథములు చదవటానికే వినియోగిస్తున్నాము. ఇవి చదివి, చదివి అయోమయమైపోతున్నాది. నిజముగా విద్యను శ్రవణము ద్వారానే నేర్వాలి. గ్రంథము ద్వారా విద్య నేర్వకూడదు. గ్రంథము ద్వారా విద్య నేర్చుకునే విద్యార్థులకు ఏకాగ్రత తక్కువైపోతుంది. ఇంటికి పోయి పుస్తకము చదువుకోవచ్చు కదాయని టీచరు చెప్పే విషయాన్ని కొంత అలక్ష్యముగా వింటారు. పాఠ్యపుస్తకములు ఉండటం చేత విద్యార్థులు వారి ఏకాగ్రతను దుర్వినియోగం చేస్తున్నారు. ప్రాచీన కాలమందు ఈ ప్రింటెడ్ బుక్స్, నోట్సు ఉండేవికావు. గురు శిష్యులు ముఖాముఖీగా కూర్చొని విద్యనభ్యసించేవారు. ఈ శిష్యులు కూడను ఐదారుగురు మాత్రమే ఉండేవారు. శిష్యులు ఏకాగ్రతతో గురువు చెప్పే విషయాన్ని హృదయానికి హత్తుకొనే విధంగా అందుకునేవారు. శిష్యులు తక్కువగా ఉండటంచేత, గురువు ఏ శిష్యుడు వింటున్నాడో ఎవరు వినటం లేదో గ్రహించటానికి అవకాశం వుండేది. గ్రంథముచేత విద్య నేర్చుకొనేవారు ఏ ఒకేకరో ఇద్దరో ఉండేవారు. ఎక్కువమంది శ్రవణము ద్వారానే నేర్చుకొనేవారు. కనుకనే, నవవిధ భక్తి మార్గములలో శ్రవణమునకు మొదటి స్థానం యిచ్చారు. ఈవిధమైన విద్యావిధానములో గురువుకు కూడా తాను చెప్పబోయే విషయం కంఠస్థముగా వచ్చి ఉండాలి. ఇది హృదయమునుండి హృదయమునకు అందించే విద్య.

భగవంతుడు అవ్యక్తంగా మనలో ఉంటుంటాడు. ఈ అవ్యక్తమైన దానిని వ్యక్తం చేయటానికి సాధన అవసరం. అగ్గిపుల్ల పెట్టెలో వున్నంతకాలం దానిలోని అగ్ని అవ్యక్తంగా ఉంటుంది. దానిని బయటకు తీసి గీచినప్పుడు మంట వస్తుంది. అనగా, ఆ గీయటమనే చర్య ద్వారా పుల్లలో అవ్యక్తంగా వున్న అగ్నిని వ్యక్తంగావించాము. అదేవిధముగా మనలో జ్ఞానమనే అగ్ని అవ్యక్తంగా ఉంది. దీనిని వ్యక్తంగావించటానికి జపము, ధ్యానము, భజన మొదలైన సాధనల ద్వారా వ్యక్తంచేయటానికి ప్రయత్నించాలి. లోకములో మనము ఏ పదార్థాన్ని కోరినా దానియందు ఒక ప్రేమ వుంటుంది. ప్రేమ వుండినప్పుడే దానిని కోరుకుంటాము. ఆ ప్రేమ మాత్రమే కాక దాని విశిష్టతయందు విశ్వాసం కూడా మనలో ఉండాలి. ఈ రెండూ వుండినంత మాత్రమున ఆ వస్తువు మనకు చిక్కదు. ఆ వస్తువును పొందే కర్మను ఆచరించాలి. దానిని పొందేటందుకు ఆచరించే విధివిధానమే కర్మమార్గము. దానిని ప్రేమించటమే భక్తిమార్గము. దానిని విశ్వసించటమే జ్ఞానమార్గము. కనుక, మనము ఏదైనా ఒక దానిని పొందాలనుకున్నప్పుడు అందులో కర్మ, భక్తి, జ్ఞాన మార్గములు సమ్మిళితములై వుంటున్నాయి. అనేకమంది భక్తి అంటే గిట్టనివారు వుంటారు. నిజముగా భక్తి అంటే తెలియని మూర్ఖులే యిటువంటివారని చెప్పవచ్చు. భక్తి అంటే ఏమిటి? ప్రేమ. నాకు అన్నము కావాలి. అన్నాన్ని ప్రేమిస్తున్నాను. అది అన్నముపైన భక్తి. తింటేగాని ఆకలి తీరదన్నది విశ్వాసము. దానిని పొందటానికి చేసే ప్రయత్నము కర్మమార్గము. ఇది అన్నము నిమిత్తమై ఆచరించే కర్మ. భక్తి, జ్ఞాన మార్గములు కావాలి. అన్నము దేహనిమిత్తము. ఆనందము మనస్సు నిమిత్తము. జ్ఞానము ఆత్మనిమిత్తము. కనుక, ఈ మూడు ఆహారములను పొందటానికి కర్మ, భక్తి, జ్ఞాన మార్గములను అనుసరించాలి.

You are not one person, but you are three
The one tou think you are-that is body-అన్నగత ప్రాణ
The one others think you are- that is mind- మనోగత ప్రాణ
The one you really are- that is atma- ఆత్మగత ప్రాణ

ఈ మూడు ప్రాములను మనము ముమ్మూర్తులుగా భావించి దానికి తగిన విద్యావిధానాన్ని అనుసరించాలి. ధనముతోను, విద్యతోను, భౌతిక సుఖములను అనుభవించవచ్చును. కాని, అవి తాత్కాలికము, శాశ్వతము కావు. 'నాకు ఇప్పుడు ఆకలిగా వుంది.

నేను అన్నము కోరుతున్నాను. అన్నము చిక్కింది. తృప్తి అయింది'. ఎంత కాలము? ఒకటి రెండు గంటల తరువాత తిరిగి ఆకలి. అన్నం కావాలి. భౌతికమైన తృప్తి అంతా 'పునరపి జననం, పునరపి మరణం' వంటిది. కాని, మానసిక శాంతి లభించెనా అది ఎప్పుడు మనము స్మరించినా ఆ సంతృప్తిని అందిస్తుంది. కనుక, మానసిక శాంతిని అందించగల విద్యను అభ్యసించాలి. మానసిక శాంతికి మాధవత్వాన్ని గుర్తించాలి. ఏకాత్మభావాన్ని గుర్తించటానికి ప్రయత్నించాలి. ఏకాత్మభావం ఒకటిగా ఉంటుంది. దేహాత్మభావం అనేకంగా ఉంటుంది.

ఉపనిషత్తులలో తత్, త్వంలకు సమన్వయము వివరించబడింది. తత్ ఏది? త్వం ఏది? ఈ రెండింటినీ కలిపేది ఏది? జవాబు చెప్పేది 'త్వం', ప్రశ్న వేసేది 'తత్'. ఈ రెండింటినీ కలిపేది 'అసి'. ఉపనిషత్తు, ఉప అనగా దగ్గర, 'ని' అనగా క్రింద, 'షత్' అనగా కూర్చో. అనగా శిష్యుడు గురువునకు దగ్గరగా క్రింద కూర్చొని విద్య అభ్యసించాలి. క్రిందనుండి శిష్యుడు ప్రశ్నిస్తాడు. పైనుండి గురువు జవాబు చెబుతాడు. జవాబు చెప్పిన తరువాత గురుశిష్యులు ఏకమైపోతారు. ఉపనిషత్తులు జీవాత్మ, పరమాత్మల సంబంధాన్ని తెలుపుతుంది. శిష్యుడు లేక జీవుడు తత్త్వమసి అనే స్థాయినుండి 'అహం బ్రహ్మాస్మి' అనే స్థాయికి చేరుతాడు. బ్రహ్మ ఎవరు అనే ప్రశ్నకు 'ప్రజ్ఞానం బ్రహ్మ' అని జవాబు లభిస్తుంది. దీనినే 'అయం ఆత్మ బ్రహ్మ' అని చెప్పవచ్చు. అనగా 'అయం ఆత్మ, అయం బ్రహ్మ'. (I am atma, I am brahma) కనుక, పిల్లలకు నేర్పేటప్పుడు ముందుగా వారు క్రింద కూర్చొని నేర్చుకునే విధంగా నేర్పాలి. పిల్లలను ప్రేమించవలసినదే. కాని, వారిని వారి స్థాయిలో ఉంచాలికాని మన స్థాయిలో ఉంచరాదు. గురుశిష్య సంబంధము ఉన్నప్పుడే విద్యాబోధన సాధ్యం. ఉద్దాలకుడు మహాజ్ఞాని. తన కుమారుడైన శ్వేతకేతును విశ్వామిత్రుని వద్దకు విద్య నేర్చుకునేందుకు పంపించాడు. కారణం ఏమిటి? తనకు విద్య లేదా? ఎంత నేర్పినప్పటికీ తనకు తన కుమారునికి మధ్య తండ్రికుమారుల భావమే వస్తుందిగాని గురుశిష్య భావము రాదు. గురుభావము ఉంటేనే శిష్యునికి విద్య ప్రాప్తిస్తుంది. పిల్లలను ప్రేమించాలి, లాలించాలి, కొన్ని కొన్ని సమయములలో శిక్షించ వలసి వచ్చినప్పుడు శిక్షించాలి. శిక్ష లేక రక్షణ లేదు. ఈ కాలంలో యిటువంటి శిక్ష లేదు కాబట్టి విద్యార్థుల విద్య వ్యర్థమైపోతుంధి. అయితే శిక్షకూడా క్రమంగా వీండాలి. అప్పుడే క్రమశిక్షణ అవుతుంది. గురువుకదాయని శిక్ష మరీ కఠినముగా ఉండకూడదు.

విద్యాబోధకులు ఈ విషయములు మనసునందు వుంచుకుంటే మన భావిభారత విద్యార్థులు మన దేశానికేకాక, ఇతర దేశములకుకూడా ఉపయోగకరముగా ఉంటారు. ముఖ్యముగా పిల్లలకు భారతీయ సంస్కృతి గురించి వివరించాలి. ఎంతోమంది ఋషులు, ప్రభువుల, పతివ్రతలు త్యాగంచేసి మన భారతీయ సంస్కృతిని నిలబెట్టారు. కనుకనే, ఈనాటి పరిస్థితులలోకూడను నిజాయితీతో జీవించటానికి వీలవుతోంది. పిల్లలకు ముఖ్యంగా నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విషయాలను నేర్పాలి. వీటితోబాటు అన్ని మతములపట్ల సమభావము, గౌరవభావము పెంపొందించాలి. అన్ని మతములు బోధించేది ఒక సత్యమే. అన్ని మతములు ఒకే ధర్మాన్ని, ఒకే గమ్యాన్ని బోధిస్తున్నాయి. కనుక, బాలవికాస్ పిల్లలు ఏ మతముపట్ల వ్యతిరేక భావము కలిగి వుండరాదు.

మొదట నీతివాక్యములు, నీతిమార్గములు, పవిత్రధర్మములు బోధించే రామాయణ, భారత, ఖురాన్, బైబిల్ మొదలగు పవిత్ర గ్రంథములలోని సూక్తులను పిల్లలకు బోధించాలి. ఇంక మనముకూడా మంచి నడవడికను కలిగి వుండాలి. వారికి బోధించి మనము ఆచరించకుండా వుండరాదు. మనము ఇక్కడ ఎంత బోధించినప్పటికీ, ఇంటిలోని వాతావరణము సరిగా లేని యెడల మన బోధన అంతా వ్యర్థమైపోతుంది. కనుక, పిల్లల తల్లిదండ్రులనుకూడా కలసి వారు ఇంట్లో పిల్లలకు ఎటువంటి ట్రైనింగ్ యివ్వాలి అనికూడా మనము వారికి చక్కగా బోధించాలి. అసలు తల్లిదండ్రుల వలనే పిల్లలు కొంతవరకు చెడిపోతున్నారు. అతి గారాబముచేత పిల్లలు పాడైపోతారు. మన ప్రేమను మనము అదుపులో వుంచుకోవాలి. వారికి అవసరమైనదానికన్నా ఎక్కువ డబ్బు యివ్వరాదు. పిల్లలు ఆదర్శవంతముగా తయారవాలంటే ఒక ప్రక్క తల్లిదండ్రులు, ఒక ప్రక్క అధ్యాపకులు బాధ్యులు.

భరతదేశ భవిష్యత్తు బాలవికాస్ పిల్లలపైన ఆధారపడి ఉంది. ఈనాటి బాలవికాస్ విద్యార్థులు రేపు మా కాలేజీ విద్యార్థులు. ఇది ప్రాథమికవిద్య. ఇది ఫౌండేషన్. వారి భవిష్యత్తు దీనిమీద ఆధారపడి ఉంది. ఇక్కడ అలక్ష్యం జరిగితే మొత్తం భవనం కూలిపోతుంది. వారి జీవిత భవనానికి ఇది పునాది కనుక, మీరు మంచివారుగా ఉండాలి. మీరు చేసే సేవ దేశసేవ, సంఘసేవ, దైవసేవ, విశ్వసేవగా భావించుకోవాలి. సర్వసేవలుకూడను ఈ ఉపాధ్యాయ స్థానములో ఉన్నాయి. ఉపాధ్యాయునిది చాలా గొప్ప స్థానం. విద్యాదానం అన్ని దానాలలో గొప్పది. మీరు దేశాన్ని తీర్చిదిద్దే శిల్పులు. విద్యార్థులనే శిలలను తీర్చిదిద్దవలసిన బాధ్యత మీపై ఉన్నది. మీరు కొంచెం శ్రమపడితే దేశానికి సేవచేసినవారౌతారు. మన ఈ లక్ష్యాన్ని స్వార్థరహితంగా సేవచేసి సాధించాలి. వారిని మీ బిడ్డలుగా భావించి పిల్లలను చక్కగా తీర్చిదిద్దుతారని నేను ఆశిస్తున్నాను. మీకున్న సమస్యలుగాని, సందేహాలుగాని నాకు చెబితే వాటికి సమాధానాలు చెబుతాను. కనుక, మీరు కాలమును వృధాచేయకుండా మీ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ, ఇంకా ఇతర ఉపాధ్యాయులందరికీ ఈ విషయాలనందించి అవసరమైన సలహాలు, ప్రోత్సాహాలు అందిస్తారని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.